

# పరిచయం

'మొక్కలకి నీళ్ళు పోసి రెండు రోజులైంది' అనుకుంటూ గార్డెన్‌లోకి వచ్చాను. నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అవటంతో కొత్తగా వచ్చామీ వూరు. కుండీలన్నీ ట్రక్‌లో జాగ్రత్తగానే వచ్చాయి. లారీలో సామానుతోపాటే వచ్చిన జవాను రాఘవయ్యని మధ్యలో ఒకసారి నీళ్ళు పోయమని చెప్పటంతో మొక్కలు మరీ ఎండిపోలేదు. అన్నిటినీ అందంగా పేర్చాను. గేట్ నుండి గుమ్మం వరకు అటూ ఇటూ క్రోటన్స్ పెట్టాను. మూడు కుండీల మధ్యగా ఒక గులాబీ చెట్టు: గుమ్మానికి ఇరువైపుల డాలియా మొక్కలు. కిటికీలో కనకాంబరం మొక్కలు. ఇలా నా అభిరుచికి తగ్గట్టుగా పెట్టాను. నా రూమ్ కిటికీ ఎదురుగా వున్న లాన్‌లో పది రకాల గులాబీ కుండీలు పెట్టాను. గులాబీలంటే ప్రాణం నాకు. ఎక్కడెక్కడి నుండో కలెక్ట్ చేస్తుంటాను. ఎండిపోయిన ఆకులు, మట్టి ఏరేసి, మట్టినంతా చదునుగా సర్ది, అన్నిటికి నీళ్ళు పెట్టి ఇంట్లోకి నడిచాను.

నాలుగు రోజుల తర్వాత బైటికెళ్ళినప్పుడు పసుప్పచ్చటి చామంతి అంటు కొన్నాను. దాన్ని పాతిపెట్టి కుండీలో నీళ్ళు పోస్తుండగా పది సంవత్సరాల ఒక బ్బాయి నా చేతికి ముదురు మెరూన్ కలర్ గులాబీ అంటుని అందించాడు. చాలా రేర్ కలర్ అది. ఎంతగా ట్రైచేసినా దొరకలేదది. సంతోషంగా 'థాంక్స్' అంటూ ఆ అబ్బాయి వైపు చూసిన నా చేతికి ఓ కవరు: అందించి తుర్రుమన్నాడు. ఆశ్చర్యపోతూనే అయోమయంగా కవర్ ఓపెన్ చేసాను. 'హలో రోజా!' గుండె గుభేలు మంది. నేనందుకున్న ప్రేమలేఖ మొదటిది. గుండె తడబడి, వూపిరి పీల్చటం కష్టమైంది. చిరుచెమటలు నుదిటిపై మెరుస్తున్నాయి. సన్నగా వేళ్ళు వణకటం మొదలైంది. ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూసాను. పరిసరాల్లో ఎవరూ లేకపోవటంతో మళ్ళీ ఉత్తరంలోనికి తల దూర్చాను. "మీ పేరెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నారా? మీ అమ్మగారు పిలుస్తుండగా విన్నానులెండి. మొక్కలికి మీరు తీసుకునే శ్రద్ధా, మీ అభిరుచి నన్ను ఎంతో ఆకర్షించాయి. అందుకే అందమైన (మీలాంటి) రోజా మొక్కని చిరుకానుకగా పంపాను. అందమైన అభిరుచి వున్న అమ్మాయి మనసూ అందంగా, స్నేహపాత్రంగా వుంటుందని నాకు తెలుసు. అందుకే ఈ సాయంత్రం వేళ ఓ కప్పు టీ తాగి మనం స్నేహితులమైపోదామా? ఇంతకీ నేనుండేది మీ ఎదురింటి, ప్రక్కింటి మేడపైన" అనుంది. ఒళ్ళు మండిపోయింది నాకు. ఆడపిల్లలంటే ఎంత లోకువ ఈ మగవాళ్ళకి. కమ్మగా కబుర్లు చెప్పేసి లోబరుచుకుంటారు. ఆనక ప్రేమ, గీమా అంటూ నాటకాలాడ్తారు. ఎంతమందిని చూడలేదు? ఇలాంటి వాళ్ళని వూరికే వదలకూడదు.

ముప్పతిప్పలు పెట్టి, మూడు చెరువుల నీళ్ళు తాగించాలి. నా కరాటే అభిరుచినీ చూపాలి అనుకుంటూనే ఎదురింటి మేడ వైపు చూసాను. మల్లెపూవులాంటి తెల్లని చీరలో నవ్వుతూ నిలబడి చేయి వూపుతోంది అందమైన ఓ యువతి. అప్పటిదాకా వున్న కోపం క్షణంలో మాయమై సిగ్గుగా నవ్వు దొంతరగా పెదవుల మీదకి వచ్చేసింది. 'వాటే లవ్లీ ఇన్విటేషన్' అనుకుంటూ నేనూ చేతినూపాను.

—ఆర్. పద్మజ

23-0-94 ఆంధ్రజ్యోతి వారపత్రిక